క్లుప్తంగా

వైభవునికి సుప్రభాత సేవ నేడు


వైభవ వేంకటేశ్వర స్వామి

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల తర్వాత సుప్రభాతం చదివి వినిపిస్తామన్నారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తామని తెలిపారు. మధ్యాహ్నం నారాయణ సేవ, సాయంత్రం విశేష హారతి ఇస్తామని తెలిపారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ


దుస్తులు పంపిణీ చేస్తున్న 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు

మద్రిపాలెం : ఇటీవల కాలంలో విజయవాడ ప్రాంతంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో సేవలు అందించడానికి వెళ్లి తిరిగొచ్చిన జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం సమకూర్చిన దుస్తులను 49వ వార్డు కార్పొరేటర్ అల్లు శంకరరావు శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, శానిటరీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కప్పరాడ పాఠశాలలో డీఈవో ఆకస్మిక తనిఖీ


కప్పరాడ ఉన్నత పాఠశాలలో రికార్డులు పరిశీలిస్తున్న డీఈవో ప్రేమ్‌కుమార్

కంచరపాలెం : జీవీఎంసీ 54వ వార్డు పాత ఐటీఐ కప్పరాడ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసన స్థాయిలను పరిశీలించారు. టెన్త్ విద్యార్థుల 100 రోజుల యాక్షన్ ప్లాన్‌పై లోతుగా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, డైరీలు లేకపోవడం, పాఠశాల రికార్డులు, రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించకపోవడంపై డీఈవో ప్రేమ్‌కుమార్ మండిపడ్డారు. టీచింగ్ టూల్స్ కార్యక్రమం అమలు విధానంపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల మధ్యాహ్న భోజనం రుచి చేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం మండల విద్యాశాఖాధికారి – 2 డి.దివాకర్ పాల్గొన్నారు.

నాట్య గురువులకు సత్కారం


సత్కారాలు అందుకున్న కళాకారులు, గురువులు

సీతంపేట : శిఖరం ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపకులు జి.కృష్ణ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో విశాఖ బాలోత్సవం పేరిట మ్యూజిక్ అండ్ డ్యాన్స్ ఫెస్టివల్ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయనగరం నర్తనశాల డ్యాన్స్ అకాడమీ గురువు డాక్టర్ రాధికా రాణి, మీనాక్షి కూచిపూడి డ్యాన్స్ అసోసియేషన్ గురువు మీనా దార్లపూడి, రాజమండ్రి శివసాయి కళా క్షేత్రం గురువు టి.సాయి మాధవికి గురు సత్కారం చేశారు. సుమారు 25 మంది చిన్నారులకు, నాట్య కళాకారులకు నాట్యాభిరామ అయోధ్య రామ బాలపురస్కారాలు ప్రధానం చేశారు. ముఖ్య అతిథులుగా హాజరైన భళ్లపూడి ప్రత్యూష, నంది అవార్డు గ్రహీత మీగడ శశి భూషణ్ స్వామి, ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ వ్యవస్థాపకులు ఎం.వి.సుబ్రహ్మణ్యం, తిలక్ పట్నాయక్, అల్లు వెంకటరమణ చేతుల మీదుగా కళాకారులను, నాట్య గురువులను ఘనంగా సత్కరించారు.

మాధవధార కేంద్రంగా జోన్-5 పాలన!

- విశాఖ ఉత్తర నియోజకవర్గంలో జోన్-5 కార్యాలయ నిర్మాణం
- రూ. 1.98 కోట్లతో పనులు
- త్వరలో జ్ఞానాపురం నుంచి మాధవధారకు మార్పు
- 24 వార్డులపై ఇక్కడి నుంచే పర్యవేక్షణ
- విశాఖ ఉత్తర, పశ్చిమ, దక్షిణ నియోజకవర్గాలతో అనుసంధానం


జ్ఞానాపురంలో ప్రస్తుతం ఉన్న జోనల్ కార్యాలయం


జోనల్ కార్యాలయ భవన నమూనా

విశాఖ విద్య: నగరంలోని మూడు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్ – 5 జోనల్ కార్యాలయాన్ని త్వరలో మాధవధార వుడా లే అవుట్‌లోకి మార్చేందుకు చకాచకా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్‌ఏడీ – బిర్లా జంక్షన్ హైవేకు ఆనుకుని ఆర్టీఏ కార్యాలయం ఎదురుగా పంపు హౌస్ పక్కన ఉన్న విశాలమైన స్థలంలో అధునాతన భవనాల నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం తొలుత రూ.1.98 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం మొదటి అంతస్తు శ్లాబ్ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా జోనల్ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారుల చాంబర్లతోపాటు, గ్రీవెన్స్ హాల్, సమావేశ మందిరం ఇలా సమస్త అవసరాలు తీరేలా భవనాన్ని డిజైన్ చేశారు. ప్రస్తుతం మంజూరైన నిధులతో పనులు కొనసాగిస్తున్నారు.

మరో రూ.2 కోట్లు అవసరం

ప్రస్తుత నిధులతోపాటు కార్యాలయం పూర్తి స్థాయిలో అందుబాటులోకి రావాలంటే అదనంగా మరో రూ.2 కోట్లు అవసరం ఉంటుందని ఇంజినీరింగ్ అధికారులు అంచనా వేశారు. ఆ మేరకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు నివేదించారు.

వసతుల లేమి వల్లే మార్పు

ప్రస్తుతం జ్ఞానాపురంలో నిర్వహిస్తున్న కార్యాలయంలో సరైన వసతులు లేవు. జోనల్ స్థాయిలో సమావేశాల నిర్వహణకు సైతం సరైన సౌకర్యాలు లేవు. కార్యాలయానికి వెళ్లే ప్రజానీకం సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ కౌన్సిల్ తీర్మానం మేరకు అధునాతన భవనం నిర్మించేందుకు నిధులు కేటాయించారు.

మూడు నియోజకవర్గాలతో అనుసంధానం

జ్ఞానాపురంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న జోన్-5 కార్యాలయం పరిధిలో 24 వార్డులు ఉన్నాయి. దక్షిణ నియోజకవర్గంలో రెండు వార్డులు, పశ్చిమ నియోజకవర్గంలో 10 వార్డులు, విశాఖ ఉత్తర నియోజకవర్గంలో అత్యధికంగా 12 వార్డులు ఉన్నాయి. మూడు నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉన్న జోనల్ కార్యాలయాన్ని పాలన పరంగా మల్కాపురం, జ్ఞానాపరం డివిజన్లుగా విభజించి ఆయా శాఖల అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు.

ప్రజానీకానికి చేరువలో..

జోన్-5 పరిధిలోకి వచ్చే 24 వార్డుల ప్రజానీకం జ్ఞానాపురంలోని కార్యాలయానికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. మల్కాపురం ఏరియా వాసులకు దగ్గరగా ఉన్నప్పటికీ, అక్కయ్య పాలెం వరకు ఉన్న నార్త్ నియోజకవర్గ ప్రజానీకానికి జోనల్ కార్యాలయం దూరాభారమవుతోంది. భవిష్యత్‌లో నియోజకవర్గాల పునర్విభజన సైతం జరిగే అవకాశం ఉంది. ఈ మొత్తం పరిణామాలను దృష్టిలో పెట్టుకుని ఎన్‌ఏడీ సెంటర్‌కు సమీపంలో ఆర్టీఏ, ఎయిర్‌పోర్టు పోలీసు స్టేషన్ ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న మాధవధార వుడా లే అవుట్‌కు తరలించేలా నూతన భవనాలు నిర్మిస్తున్నారు.


మాధవధార వుడా లే అవుట్‌లో నిర్మిస్తున్న భవనం

వారికి దగ్గర.. వీరికి దూరం

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో పరిధిలోని 12 వార్డుల ప్రజలకు కొత్త జోనల్ కార్యాలయం అందుబాటులో ఉంటుంది. అయితే మల్కాపురం ప్రాంత వాసులు ఇక్కడికి రావడానికి కొంత దూరమవుతుంది. వీరంతా మింది మీదుగా ఎన్‌ఏడీ సెంటర్ నుంచి మాదవధార వుడా లే అవుట్‌లోని జోనల్ కార్యాలయానికి చేరుకోవాల్సి ఉంటుంది.

సకాలంలో పూర్తి చేస్తాం

జోనల్ కార్యాలయ భవన నిర్మాణాలను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్మాణాల్లో నాణ్యతకు పెద్ద పీట వేస్తున్నాం. ఎప్పటికప్పుడు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నాం. సెల్లార్‌తోపాటు మూడు అంతస్తుల భవనం నిర్మాణం కోసం మరో రూ.2 కోట్లు అవసరం ఉంటుంది. దీనిపై ప్రతిపాదనలు చేసి ఉన్నతాధికారులకు నివేదించాం.

– భరణి కుమార్, డీఈ, జీవీఎంసీ జోన్ –5

అలరించిన ఆధ్యాత్మిక గీతాల కచేరీ


గీతాలు ఆలపిస్తున్న గాయకుడు అభిషేక్

సీతంపేట : అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ఆధ్యాత్మిక గీతాల గాత్ర కచేరీ భక్తులను అలరించింది. వరంగల్‌కు చెందిన అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు అభిషేక్ సుత్రావు అద్భుతమైన గానంతో ఆహూతులను ఆకట్టుకున్నారు. అమ్మవారిని స్తుతిస్తూ పాడిన గీతాలు భక్తులను పరవశింపజేశాయి. ఇతనికి హెచ్.రమాచరణ్ వయోలిన్‌పై, టి.ఎస్.చైతన్య మృదంగంపై వాద్య సహకారం అందించారు. అనంతరం అభిషేక్‌ను పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ సత్కరించారు.

వాకర్స్ క్లబ్ సమావేశం నేడు

మురళీనగర్ : మురళీనగర్ వాకర్స్ క్లబ్ వార్షిక సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి, కార్యదర్శి పి.చెల్వరాజు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు వాకర్స్ పార్కు సభా ప్రాంగణంలో నిర్వహించే సమావేశంలో ప్రస్తుత కార్యవర్గం ఆధ్వర్యంలో నిర్వహించిన అభివృద్ధి, సామాజిక సేవా కార్యక్రమాల ప్రగతి, భవిష్యత్ ప్రణాళిక తదితర అంశాలపై విస్తృత స్థాయిలో చర్చిస్తామన్నారు. అనంతరం ఎన్నికల అధికారి నిమ్మగడ్డ బుచ్చయ్య పర్యవేక్షణలో 2025 సంవత్సరానికి నూతన కార్యవర్గం ఎన్నికల షెడ్యూలు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు, వాకర్స్ ఫౌండేషన్ ట్రస్టీ ఏహెచ్‌వీ వెంకటరావు పాల్గొంటారని చెప్పారు. ''వాకర్స్ వాయిస్'' నవంబర్ నెల సంచిక ఆవిష్కరిస్తామన్నారు. సభ్యులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

అన్నదాత సుఖీభవ


ధ్యాన మందిరంలో మాలధారులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న నిర్వాహకులు


ఫ్రిజ్‌లో భద్రపరిచిన ఆహారం అన్నార్తులకు అందజేస్తున్న నూకల శేషగిరిరావు

ధ్యాన మందిరంలో మాలధారులకు నాలుగేళ్లుగా అన్నసమారాధన

తాటిచెట్లపాలెం : అన్నిదానాల్లో కెల్లా అన్నదానం గొప్పదని పెద్దలు చెబుతుంటారు. ఆ మాటను నిజం చేస్తూ మాలధారులు, అభాగ్యుల ఆకలి తీరుస్తూ నారాయణ సేవలో తరిస్తున్నారు ధ్యాన మందిరం నిర్వాహకులు. కార్తీక మాసం సందర్భంగా రైల్వే న్యూ కాలనీ రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో ఈ నెల 4 నుంచి మాలధారుల కోసం ప్రత్యేక అన్నసమారాధన ప్రారంభించారు. మాలధారుల కోసం 2021లో ప్రారంభించిన అన్నదానం వరుసగా నాలుగో ఏడాది కూడా కొనసాగిస్తున్నారు. 2021లో సుమారు 63 రోజులు, 2022లో 74 రోజులు, 2023లో 54 రోజులు అన్నప్రసాదం అందించారు. ఈ సంవత్సరం జనవరి 8 వరకు 64 రోజులు అన్నసమారాధన కొనసాగించేందుకు ధ్యాన మందిరం నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. షిరిడీ సాయిబాబా, అయ్యప్ప, భవానీ, శివ, కనక మహాలక్ష్మి మాలలు ధరించిన భక్తుల కోసం రోజూ మధ్యాహ్నం హారతి అనంతరం 12.30 గంటల నుంచి అన్నప్రసాదం వడ్డిస్తున్నారు.

2010 నుంచి నిత్యాన్నదానం

ధ్యాన మందిరంలో 2010లో నిత్యాన్నదానం ప్రారంభించారు. అప్పటి నుంచి రోజూ పేదలు, యాచకులు, భక్తులు ప్రసాదం స్వీకరిస్తూ ఆకలి తీర్చుకుంటున్నారు. రోజూ సుమారు 100 మంది, గురువారాల్లో సుమారు 200 మంది ఇక్కడ అన్నదానంలో పాల్గొంటారని ఆలయ కమిటీ సభ్యులు త్రిపురాన రాంబాబు తెలిపారు. ధ్యాన మందిరంలో నిర్వహిస్తున్న సేవలను గుర్తించిన ఇంటర్నేషనల్ వైశ్ ఫౌండేషన్ వారు 2022లో అన్ని వేళల్లో ఆహారం నిల్వ ఉంచడం కోసం కమ్యూనిటీ ఫ్రిజ్‌ను బహూకరించారు. దీంతో 24 గంటలు అవసరమైన వారి కోసం ఇక్కడ ఆహారం అందుబాటులో ఉంచుతున్నారు.

నిరాటంకంగా నారాయణ సేవ

వరుసగా నాలుగో ఏడాది కూడా మాలధారుల కోసం అన్నసమారాధన ఏర్పాటు చేయడం సంతోషంగా ఉంది. కార్తీక మాసంలో వివిధ మాలలు ధరించిన భక్తులకు నిష్ఠతో, ప్రత్యేక శ్రద్ధతో ప్రత్యేకంగా ఆహారం తయారుచేసి, వడ్డిస్తున్నాం. భక్తులు, దాతల సహకారంతో నారాయణ సేవ నిరాటంకంగా కొనసాగిస్తున్నాం.

– నూకల శేషగిరిరావు, ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు

విజయసాయిరెడ్డిని కలిసిన కార్పొరేటర్ కెల్ల సునీత


విజయసాయిరెడ్డితో కార్పొరేటర్ సునీత, నాయకులు

సీతమ్మధార : వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో పార్టీ రీజినల్ కో – ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యులు వి.విజయసాయిరెడ్డిని 13వ కార్పొరేటర్ కెల్ల సునీత, సత్యనారాయణ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మొల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో పాత నిందితుల అరెస్ట్

సీతమ్మధార : పరారీలో ఉన్న గంజాయి కేసుల్లో నిందితులను నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలో నమోదైన రెండు కేసుల్లో వంతల నారాయణ (28), షావుకారి శ్రీనివాస్ (21) పరారీలో ఉన్నారు. వీరు అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు ప్రాంతంలో ఉన్నట్టు సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసుని నాలుగో పట్టణ సీఐ ఎస్.విజయకుమార్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం


కరపత్రాలు పంచుతున్న సీపీఎం నాయకులు

సీతంపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో విశాఖ జిల్లాలో ఈ నెల 8 నుంచి 14 వరకు ప్రజా పోరు నిర్వహిస్తున్నామని ఆ పార్టీ జిల్లా నాయకులు యు.ఎస్.ఎన్.రాజు తెలిపారు. జీవీఎంసీ 45వ వార్డు పరిధి అక్కయ్యపాలెంలో శుక్రవారం సీపీఎం జోన్ నాయకులు అప్పలరాజు, లలిత, లీల, సోమ, ప్రసాద్‌తో కలిసి ప్రజాపోరుపై ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు ధరలు అదుపు చేసేందుకు చర్యలు చేపట్టడం లేదన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చర్యలు వేగవంతం చేయడంతోపాటు, విద్యుత్ చార్జీల పెంపుతో సామాన్యుడిపై ఆర్థిక భారం పెరిగిందన్నారు. ఉచిత ఇసుక అమలు, ఖాళీ పోస్టుల భర్తీ, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయడం, లేబర్ కోడ్స్ రద్దు, తదితర డిమాండ్లతో ప్రచారం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ నెల 14 వరకు ఇంటింటికీ కరపత్రాల పంపిణీ, పాదయాత్ర, బృంద సమావేశాలు, సచివాలయాల వద్ద నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

లక్ష్మీ టయోటా కార్ల నూతన షోరూం ప్రారంభం


షోరూం ప్రారంభిస్తున్న అతిథులు

కంచరపాలెం : భారతదేశంలోని ఆటో మొబైల్ రంగంలో అగ్రగామి సంస్థ టయోటా కంపెనీ కంచరపాలెం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో శుక్రవారం నూతన షోరూమ్ లక్ష్మీ టయోటాను ముఖ్య అతిథులు హాన్ సాచూ, ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ వేలాయుధన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టయోటా కంపెనీ తమ కార్ల శ్రేణితో వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందిస్తూ అగ్రగామి సంస్థగా నిలిచిందని చెప్పారు. సీఈవో రామకృష్ణ మాట్లాడుతూ విశాలమైన ప్రాంగణంలో తమ నూతన షోరూమ్ ప్రారంభించామని, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు, సేవలు అందిస్తామన్నారు. అధునాతన పరికరాలతో రోజుకు 50 కార్ల వరకు సర్వీసు అందించగలమన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ మహారాజ్ ముఖర్జీ, మేనేజర్ నిఖిల్ బాబలాడీ, సీనియర్ ఆఫీసర్ చమన్ శర్మ, డైరెక్టర్లు పాములపాటి రవీంద్రబాబు, రాజేష్, ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

రేసపువానిపాలెంలో అన్నదానం


అన్నదానం చేస్తున్న స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎండీ రమేష్ రెడ్డి

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతి స్వరూపిణి దుర్గా అమ్మవారి ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్వాతి ప్రమోటర్స్ చైర్మన్ కృష్ణా రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ రమేష్‌రెడ్డి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి వారం అన్నదానం చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. అన్ని దానాల్లోనూ అన్నదానం ఎంతో మిన్న అని కొనియాడారు. ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు, ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మ, కె.సుబ్బలక్ష్మి, ఆలయ కమిటీ ప్రెసిడెంట్ గురునాథ్ రెడ్డి, సెక్రటరీ బాబీ, తదితరులు పాల్గొన్నారు.

కన్నీరు పెట్టిస్తున్న ఉల్లి


ఎంవీపీ రైతుబజార్‌లో ఉల్లిపాయలు

ఆరిలోవ: కార్తీక మాసం వచ్చిందంటే చికెన్ ధరలు మాదిరిగా ఉల్లి ధరలు కూడా తగ్గుతాయి. ఈ నెలంతా ఎక్కువ మంది ఉల్లి వాడటం మానేస్తారు. అయితే కొద్ది రోజులుగా ఉల్లి ధరలు అమాంతం పెరిగిపోతున్నాయి. దీంతో ఉల్లిపాయలను కొని కోయక ముందే ప్రజలను కన్నీరు పెట్టిస్తోంది. వాటి ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో వినియోగదారుల కళ్లలో నీరు తిరుగుతోంది. వారం రోజులుగా ఉల్లి ధర పెరుగుతూ వస్తోంది. వీటి ధర ఇంకా పెరగనుందని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో వినియోదారులు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజులుగా అన్ని రకాల ఉల్లి ధరలు పెరగడం విశేషం. రైతుబజార్లలో ఈ నెల 1న కర్నూలు ఉల్లి కిలో రూ.26, సోలాపూర్ ఉల్లి కిలో రూ.44, మహారాష్ట్ర ఉల్లి కిలో రూ.50 ఉండేది. శుక్రవారం వాటి వాటి ధరలు కిలో రూ.40, రూ.54, రూ.58కు పెరిగింది. దీంతో వినియోగదారులు తప్పక కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అన్ని కూరగాయల ధరలతోపాటు ఉల్లి, నిత్యావసర సరకుల ధరలు విపరీతంగా పెరిగిపోతున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీటి ధరల నియంత్రణపై దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ప్రమాదకరంగా గోతులు


మహారాణి పార్లర్ కూడలి వద్ద ఏర్పడిన గొయ్యి


అక్కయ్యపాలెం 80 అడుగుల రోడ్‌లో ఉన్న గొయ్యి

సీతంపేట : ప్రధాన రహదారుల్లో గోతులు ప్రమాదకరంగా మారాయి. రాత్రి వేళల్లో వాహన చోదకులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. జీవీఎంసీ 26వ వార్డు పరిధి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లో మహారాణి పార్లర్ కూడలి వద్ద ఏర్పడిన గొయ్యి ప్రమాదకరంగా ఉంది. గత ఏడాది మహారాణి పార్లర్ కూడలి బ్యూటిఫికేషన్ చేశారు. ఇటీవల కూడలి వద్ద ఉన్న పిండి మిల్లు ఎదుట గొయ్యి ఏర్పడింది. 80 అడుగుల రోడ్ నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌కు వాహనాలు మలుపు తిరిగే చోట గొయ్యి ఉండటంతో వాహదారులు గోతిలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే 44వ వార్డు 80 అడుగుల రోడ్‌లో గెడ్డ వద్ద గొయ్యి ఏర్పడింది. కొన్ని నెలలుగా ఈ గొయ్యితో అటుగా ప్రయాణించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొద్ది రోజుల కిందట డెబ్రిస్‌తో గోతిని పూడ్చినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు మట్టి కొట్టుకుపోవడంతో మరలా గొయ్యి ఏర్పడింది. సంబంధిత అధికారులు స్పందించి గోతులు పూడ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

సీతమ్మధార : రామాటాకీస్ ప్రాంతంలో గంజాయితో తిరుగుతున్న ఓ వ్యక్తిని ద్వారకా జోన్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బిహార్‌కి చెందిన రణబీర్‌యాదవ్ (27) శుక్రవారం రామాటాకీస్ ప్రాంతంలో నాలుగు కిలోల గంజాయితో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడని సమాచారంతో ద్వారకా పోలీసులు దాడి చేసి అరెస్టు చేశారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు. ఒడిశా నుంచి తీసుకొచ్చిన గంజాయిని గోవాకి తరలించే క్రమంలో అరెస్ట్ చేశారు. ఈ కేసుని ద్వారకా సీఐ బీవీ రమణ పర్యవేక్షణలో ఎస్ఐ శ్రీను దర్యాప్తు చేస్తున్నారు.